నులిపురుగుల నివారణ మందులు అందించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ప్రతి చిన్నారికీ నులిపురుగుల నివారణ మందు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 14వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న నులిపురుగుల నివారణ దినోత్సవ(నేషనల్ డీవార్మింగ్ డే) కార్యక్రమంపై గురువారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆయన కార్యాలయం నుంచి వైద్య ఆరోగ్య, విద్య, సాంఘిక సంక్షేమం, మున్సిపల్, మహిళా, శిశు సంక్షేమ తదితర శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రతి చిన్నారికీ నులిపురుగుల నివారణ మాత్రలను తప్పక వేయించాలన్నారు.

4.78 లక్షల డోసులు సిద్ధం..

జిల్లాలో రూ.4.50లక్షల మందికి నులిపురుగుల నివారణ మందును సరఫరా చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని కలెక్టర్ చెప్పారు. ఇందుకు సంబంధించి 4.78 లక్షల నులిపురుగుల నివారణ మందు డోసులు సిద్ధం చేశామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో మందును పంపిణీ చేసేందుకు ప్రణాళికను రూపొందించి అమలు చేయాలన్నారు. 1 నుంచి 2 ఏళ్ల లోపు చిన్నారులకు సగం ట్యాబ్లెట్, 2 నుంచి 19 ఏళ్ల వయస్సు వారికి ట్యాబ్లెట్ అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల అధ్యాపకులు, ఆశ కార్యకర్తలు, వసతి గృహ సంక్షేమ అధికారులు పూర్తిగా భాగస్వాములు అయ్యేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఈఓ సీవీ రేణుక, గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య, సోషల్ వెల్ఫేర్ ఎం వి.విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి శంకుస్థాపన


ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం 42వ డివిజన్ హెచ్ బి కాలనీలో గల శ్రీ రామ క్షేత్రం నందు నూతనంగా నిర్మించనున్న వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయానికి గురువారం పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ఒక మంచి సంకల్పంతో మహామేరు శ్రీ చక్ర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ దేవాలయంలో వాసవీ మాత దేవాలయ నిర్మాణానికి, వాసవి మాత విగ్రహ ప్రతిష్ఠతకు స్వయంగా పెనుగొండ వాసవి మాత క్షేత్రానికి వెళ్లి పరిశీలించి అవగాహన తెచ్చుకొని ఇక్కడ ఏర్పాటు చేస్తున్నందుకు దేవాలయం కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. దేవాలయానికి విచ్చేయు భక్తులకు అన్నదానం చేసేందుకు గాను భోజనశాల, చక్కటి గోశాలను నిర్మిస్తున్నారన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ప్రతి పండగను ఈ దేవాలయంలో అత్యంత వైభవంగా చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో పశ్చిమ నియోజకవర్గంలో ఈ దేవాలయం ఒక ఆధ్యాత్మిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేవాలయ నిర్మాణానికి అహర్నిశలు కృషి చేస్తున్న దేవాలయ కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్పొరేటర్ పడిగపాటి చైతన్య రెడ్డి,ఆలయ కమిటీ సభ్యుల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

22న మహాలక్ష్మి అమ్మవారికి గాజుల అలంకారం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):శోభకృత్ నామ సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని చిట్టినగర్‌లో వేం చేసిన మహాలక్ష్మి అమ్మవారికి గాజులతో విశేషంగా అలంకరిస్తామని ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ తెలిపారు. 22వ తేదీ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేషంగా అలంకరణతో పాటు ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. తెలుగు వారి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని అలంకరించడంతో పాటు విచ్చేసే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ళ హనుమంతరావులు పేర్కొన్నారు.

టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):నిరుద్యోగ యువతులకు స్వయం ఉపాధి కల్పించేందుకు టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న మహిళలు ఈ ట్రైనింగ్ కోర్సులకు అర్హులని పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఆసక్తి ఉన్న వారు పాస్ట్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్ కార్డుతో ఈ నెల 25వ తేదీ లోగా విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో నేరుగా సంప్రదించాల్సిందిగా కోరారు.

నేడు లబ్బీపేటలో మెగా వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): అల్–మునీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మునీర్ అహ్మద్ షేక్ తెలిపారు. మసీదు వీధిలోని ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో గుండె జబ్బులు, ఎముకలు కీళ్ల వ్యాధులకు సంబంధించి వైద్యులు పాల్గొని పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. బాడీ మాస్ ఇండెక్స్(బీఎంఐ), షుగర్, బీపీ, ఇసీజీ, 2డి ఇకో పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందచేస్తారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహించే ఈ శిబిరాన్ని లబ్బీపేట పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

10, 11 తేదీల్లో రీజనల్ క్విజ్ చాంపియన్‌షిప్ పోటీలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 10, 11 తేదీల్లో రీజనల్ క్విజ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఏపీ ఉన్నత విద్యామండలి రాష్ట్ర వ్యాప్తంగా క్విజ్ పోటీలను నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగా తొలి దశలో ప్రాంతీయ స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వివిధ కళాశాలలు విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. పోటీలు ప్రిలిమ్స్, క్వాలిఫెయింగ్, క్వార్టర్ ఫైనల్స్‌గా మూడు దశల్లో నిర్వహిస్తామన్నారు. ప్రాంతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించే సెమీ ఫైనల్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

4.5 కేజీల గంజాయి పట్టివేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వాహన తనఖీల్లో భాగంగా ఓ వ్యక్తి నుంచి భవానీపురం పోలీసులు 4.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. భవానీపురం ఎస్‌ఐ అనూష సిబ్బందితో కలిసి గురువారం వాహన తనిఖీలు చేస్తున్నారు. కబేళా సెంటర్ రామరాజ్యనగర్ రైలు కట్ట వద్ద ఇమ్రాన్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు.అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి దొరికింది. గంజాయి సీజ్ చేసి ఇమ్రాన్ పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు నిందితుడికి 15 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

వివిధ రంగాల్లో మహిళల సేవలు ప్రశంసనీయం

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఒక అక్కగా, చెల్లిగా, తల్లిగా, భార్యగా, మార్గదర్శకురాలిగా మహిళలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మాచవరంలోని దక్షిణ హిందీ ప్రచారసభ హిందీ కళాశాలలో గురువారం మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పేరిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ బల్వీందర్ కౌర్ మహిళల ఔన్నత్యాన్ని కొనియాడారు. సమానత్వంతోనే అభ్యున్నతి సాధ్యమని తెలిపారు. కొంతమంది రచనలకు మూలము, స్ఫూర్తి మహిళలేనన్నారు. తులసి దాస్ ని గొప్పగా మార్చింది ఆయన భార్య రత్నావళి అని తెలిపారు. మహాత్మాగాంధీ ఆంగ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ వై.లలితా కుమారి ఆధునిక మహిళ ఉపాధ్యాయిని విధి నిర్వహణకు సంబంధించిన కవితను వినిపించారు. బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్, సభ అధ్యక్షురాలు డాక్టర్ ఓ.చారులత ప్రపంచ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. గుబ్బల పద్మావతి, సంధ్య తదతరులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ పునఃప్రతిష్ఠ


స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


సీతారామస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దుర్గగుడి చైర్మన్


శాంతి కల్యాణం చేస్తున్న అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):వీఎంసీ కాలనీలోని రామాలయంలో వేం చేసిన శ్రీ సీతా, లక్ష్మణ, హనుమత్ సమేత శ్రీరామచంద్ర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ నుంచి మంజూరైన రూ. 20.75 లక్షల నిధులతో పునర్నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తొలుత అర్చకులు దేవతా విగ్రహాలకు పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసింది. 40 ఏళ్ల కిందటి రామాలయం జీర్ణోద్ధరణకు చేరుకోవడంతో అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుని స్థానికులు కోరారు. దీంతో ఆయన ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించడమే కాకుండా పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 46, 47వ డివిజన్ల అధ్యక్షులు వెన్నం రజనీకుమార్, కూరాకుల నాగ, రాయన నరేంద్ర, జలసూత్రం శ్రీనివాసరావు, కాలనీ వాసులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా అన్నపూర్ణాదేవి విగ్రహ ప్రతిష్ఠ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):చిట్టినగర్ పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో గంగా అన్నపూర్ణదేవి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. రాజగిరి వెంకట రాజేష్, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. గురువారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, అఖండ దీపారాధన, మండపారాధన, కలశ స్థాపన జరిగాయి. అనంతరం గంగా అన్నపూర్ణాదేవి విగ్రహానికి క్షీరాధివాసం, జలాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాదివాసం అనంతరం విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. అనంతరం పూర్ణాహుతిని ఆలయ అర్చకులు జరిపించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి శాంతి కళ్యాణం, అనంతరం పవళింపు సేవ జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు తరలిరాగా, దేవస్థాన కమిటీ వారికి ప్రసాదాలను అందచేసింది.

మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన



మధురానగర్(విజయవాడసెంట్రల్):మానవ అక్రమ రవాణాను నిరోధించేందుకు యువత అప్రమత్తంగా ఉండాలని ప్రజ్వల ఫౌండేషన్ సంస్థ సభ్యులు వై.చంద్రయ్య సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మానవ అక్రమ రవాణా నిరోధంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మానవ అక్రమ రవాణా ఏవిధంగా జరుగుతుంది. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి బారిన పడకుండా జాగ్రత్తతో ఉండాలని అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సంబందిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నీరజ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాకు పాల్పడే వారి నుంచి బాల బాలికలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు.

భక్తితో సేవిస్తే బాబా ఆశీస్సులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): భక్తితో సేవిస్తే బాబావారి ఆశీస్సులు తప్పక లభిస్తాయని మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. ముత్యాలంపాడు మందిరంలో గురువారం ఆయన షిరిడీ సాయిబాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబా ఆశీస్సులతోనే తాను ఈ స్థాయియి చేరుకున్నానని చెప్పారు. షిరిడీలో మాదిరిగా సేవలు అందిస్తూ మందిరంను తీర్చిదిద్దిన నిర్వాహకులను అభినందించారు. ఈ నెల 28వ తేదీన లోక కళ్యాణార్ధం నిర్వహించ తలపెట్టిన కోటి రుద్రాక్ష అభిషేకం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాబాకు పూజలు చేసి కోటి రుద్రాక్షలకు హారతి ఇచ్చారు. ఆలయ అర్చకులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదం చిత్రపటం, శేషవస్త్రంతో న్యాయమూర్తిని సత్కరించారు. తొలుత ఆలయ మర్యాదలతో అర్చకులు, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పొన్నలూరి లక్ష్మణరావు, కుంచనపల్లి రవిశంకర్ స్వాగతం పలికారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రగిరి విష్ణువర్ధన్, మందిర కోశాధికారి మండలపర్తి సత్య శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలీసుస్టేషన్ ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్):ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన గుణదల పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి సిద్ధమయింది. ప్రజలందరికీ అందుబాటులో ఉండేందుకుగానూ మధురానగర్ వీవీనరసరాజు రోడ్డులో గుణదల పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన అన్ని పనులు పూర్తిచేశారు. గుణదల పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పోలీస్ కమిషనర్ టీకే రాణా ప్రారంభిస్తారు.

మహిళల సంక్షేమమే ధ్యేయంగా పాలన

ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతి

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): మహిళల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నారని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పండిట్ నెహ్రూ బస్టేషన్‌లోని జోనల్ కార్యాలయంలో పలువురు మహిళా ఉద్యోగులు తాతినేని పద్మావతిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళలకు పెద్ద పీట వేసి పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ఏపీఎస్ ఆర్టీసీలో నలుగురికి జోనల్ చైర్మన్ పదవులను ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని తెలిపారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పలువురు కండక్టర్లకు అవార్డులు అందించారు. జిల్లా ప్రజారవాణా సంస్థ అధికారి ఎంవై. దానం, పండిట్ నెహ్రూ బస్టేషన్ డిప్యూటీ సీటీఎం బషీర్ అహ్మద్, ప్రియ, నళిని, వివిధ అసోసియేషన్ నాయకులు రామకృష్ణ, రావి సుబ్బారావు, డీవీ రావు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు ఆటల పోటీలు


ఏకేపీటీపీఎం స్కూల్లో త్రోబాల్ ఆడుతున్న సచివాలయ ఉద్యోగులు

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): సత్యనారాయణపురం 215, 216, 127, 218 సచివాలయ పరిధిలోని స్పోర్ట్‌మీట్–2023లో అడ్మిన్‌లు, సెక్రటరీలు, వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి ఆధ్వర్యంలో ఏకేటీపీఎం స్కూల్లో నిర్వహిస్తున్న పోటీల్లో జెర్సీలను నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తన కార్యాలయంలో ప్రారంభించి క్రీడాకారులకు అందజేశారు. ఏకేటీపీ స్కూల్, సత్యనారాయణపురం ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగే ఈ ఈవెంట్స్‌లో మొదటి రోజు మహిళా క్రీడాకారులకు త్రోబాల్, వాలీబాల్, స్పీడ్ రన్, రన్నింగ్ రేస్ పోటీలు, పురుషుల్లో వాలీబాల్, కబాడ్డి, షటిల్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శర్వాణిమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మానసిక, శారీరక ఆరోగ్యం కోసం క్రీడలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. 12 విభాగాల్లో నిర్వహించే పోటీల్లో విజేతలకు ఈ నెల 11న ముగింపు వేడుకల్లో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేతుల మీదుగా మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు బహుమతులు అందిస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు లంకా బాబు, భాస్కర్, ఫణి, చాంద్ శర్మ, కె.ఫణి, కృష్ణమోహన్, రవిశంకర్ తదితరులు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి


డీఆర్వో మోహన్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న పెన్షనర్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఇంటర్‌మీడియట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు డీఆర్వో కె.మోహన్‌కుమార్‌ను కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. ప్రతినెలా 1వ తేదీన పెన్షన్ జమ చేయాలని, పెన్షనర్లకు రావాల్సిన కరువు భత్యం బకాయిలు వెంటనే చెల్లించాలని, 11వ వేతన సంఘం బకాయిలను వెంటనే చెల్లించాలని, ఆరోగ్య కార్డు ద్వారా అన్ని వ్యాధులకు వైద్యం అందించాలని, కార్పొరేటు అసుపత్రుల్లో అవుట్ పేషెంటు చికిత్సలు పొందే అవకాశం కల్పించాలని కోరారు. డీఆర్వోను కలిసిన వారిలో ఇంటర్‌మీడియట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సంపూర్ణరావు, ఉపాధ్యక్షుడు టీఎస్ఎస్‌కే ప్రసాద్, కార్యదర్శి ప్రభాకరరెడ్డి, జి. నారాయణరావు, జొన్నలగడ్డ ప్రభాకర్, కటకం క్రిస్టోఫర్ తదితరులు ఉన్నారు.

సమాజ సేవలో విద్యార్థుల భాగస్వామ్యం

ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు


విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ప్రొఫెసర్ రామ్మోహన్‌రావు, కాలేజీ సిబ్బంది తదితరులు


జానపద నృత్యాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):విద్యార్థులు చదువులో ప్రతిభ చూపుతూనే సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ కె.రామ్మోహనరావు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల 47వ వార్షికోత్సవం గురువారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని నైపుణ్యాలు పెంచుకుంటే ప్రముఖ కంపెనీలు వెతుక్కుంటూ వచ్చి ఉద్యోగాలు కల్పిస్తాయని చెప్పారు. కళాశాల పూర్వ విద్యార్థి, జేపీ మోర్గాన్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ దాపర్తి రవిశంకర్ మాట్లాడుతూ జీవితంలో చేరాలనుకున్న లక్ష్యాలను ఉన్నతంగా నిర్దేశించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, ప్రణాళిక బద్ధమైన కృషి ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను సులభంగా అధిరోహించవచ్చునని చెప్పారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో కూడా ప్రతిభ చూపుతున్నారని చెప్పారు. కళాశాల వార్షిక నివేదికను తెలియజేశారు. సిద్ధార్థ అకాడమీ వైస్ ప్రెసిడెంట్ మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ సూరెడ్డి వెంకటేశ్వరరావు పాల్గొని విద్య, క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. కళాశాల డీన్ రాజేష్ సీ.జంపాల, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మనోరంజనితో పాటుగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకలు ప్రారంభ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంప్రదాయ స్వాగత నృత్యాలు అలరించాయి. పలు గీతాలను ఆలపించారు. సభకు ముందుగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

సౌకర్యాల కల్పనతోనే మెడికల్ పీజీ సీట్లు

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్


డాక్టర్ మెహబూబ్ షేక్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రులు, వైద్య కళాశాలలో నాలుగేళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతోనే పీజీ సీట్లు వరదలా వచ్చాయని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్వీర్యం చేయడంతో ఐదేళ్లలో ఒక్కపీజీ సీటు కూడా రాలేదని ఆయన గుర్తు చేశారు. విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాలకు వేర్వేరు విభాగాల్లో 41 పీజీ సీట్లు ఇప్పటికే మంజూరు కాగా, మరో 30 సీట్లు రానుండటం సంతోషకరమైన విషయం అన్నారు. ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో కూడా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 9 పీజీ సీట్లు రాగా, మళ్లీ ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 15 పీజీ సీట్లు వచ్చాయన్నారు. మెడికల్, డెంటల్‌లో ఇన్ని పీజీ సీట్లు ఎప్పుడూ రాలేదని, ఇదొక ఒక చారిత్రాత్మక విషయం అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో ఒక విప్లవం సృష్టిస్తున్నారని, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు పెరగడం అంటే పేద మెరిట్ విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందిస్తూ, వైద్య విద్య అభివృద్ధికి దోహదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చరిత్రలో నిలిచిపోతుందని డాక్టర్ మెహబూబ్ షేక్ అన్నారు.

ఆలస్యంగా పరీక్షకు హాజరైన విద్యార్థుల నిలిపివేత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ఆలస్యంగా వచ్చిన 54 మంది విద్యార్థులను పరీక్ష రాసేందుకు అనుమతించని ఘటన గురువారం చోటుచేసుకుంది. జి.కొండూరు మండలంలోని శ్రీవాణి ఫార్మసీ కళాశాల జేఎన్‌టీయూ కాకినాడకు అనుబంధంగా కొనసాగుతోంది. బీఫార్మసీ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కోర్సు చివరి పరీక్షలను నిర్వహిస్తున్నారు. జేఎన్‌టీయూ కళాశాల విద్యార్థులకు పరీక్షా కేంద్రంగా విజయవాడలోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యాసంస్థను కేటాయించారు. గురువారం రెండో పరీక్షకు విద్యార్థులు హాజరుకావాల్సి ఉంది. ఉదయం పది గంటలకు పరీక్ష ప్రారంభమవుతే శ్రీవాణికి చెందిన విద్యార్థులు 10:27 నిమిషాలకు పరీక్షా హాల్‌కు చేరుకున్నారు. దీంతో వారిని లోనికి వెళ్లనీయకుండా నిలిపివేశారు. పరీక్షా కేంద్రం నిర్వాహకులు జేఎన్‌టీయు కాకినాడ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఆలస్యంగా వచ్చిన వారిని పరీక్షకు అనుమతించవద్దని ఆదేశించారు. వారి ఆదేశాలతో కేంద్రం నిర్వాహకులు విద్యార్థులను నిలిపివేశారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. బస్సు ఆలస్యంగా రావటంతోనే పరీక్షకు సకాలంలో హాజరుకాలేకపోయినట్లు విద్యార్థులు పేర్కొన్నారు. అయితే పరీక్షలో 30 మార్కులకు సంబంధించిన బిట్ పేపర్ ఉంటుందని, ఒకవేళ అనుమతించినట్లయితే మాస్ కాపీయింగ్‌కు అవకాశముంటుందని విశ్వవిద్యాలయం అధికారులు భావించి ఈ నిర్ణయం తీసుకొని ఉంటారని పరీక్షా కేంద్రం నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలను లేఖ రూపంలో విశ్వవిద్యాలయానికి నివేదించినట్లు తెలిపారు.

ఇది జనరంజక బడ్జెట్

పటమట(విజయవాడతూర్పు):ప్రజలపై పన్నుల భారాన్ని మోపకుండా జనరంజకంగా వీఎంసీ బడ్జెట్‌ను రూపొందించామని వీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యం అన్నారు. బడ్జెట్ సమావేశం అనంతరం ఆయన తన చాంబర్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజలకు లబ్ధి చేకురేలా వాస్తవానికి దగ్గరగా వీఎంసీ 2023–24 బడ్జెట్ ఉందని చెప్పారు. దీనిపై ప్రతి పక్షాల సభ్యులు అవాస్తవాలు మాట్లాడటం సరికాదని తెలిపారు. గత టీడీపీ మాదిరి ఇది అంకెలగారడి ప్రభుత్వం కాదని తెలిపారు. ఆచరణలో చేసి చూపే ప్రభుత్వమని పేర్కొన్నారు. అన్ని డివిజన్లకు సమాంతరంగా నిధులను బడ్జెట్‌లో కేటాయించామన్నారు. డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు బి.విజయ్‌కుమార్ తదితరులున్నారు.

చైతన్యవంతం చేయాలి

మైలవరం: మహిళా పోలీస్‌లు గ్రామీణ మహిళలను చైతన్యవంతం చేయాలని జడ్జీ షేక్ షిరీన్ తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా సుప్రీం కోర్టు జాతీయ న్యాయ సేవాదికార సంస్థ ఆదేశాల మేరకు వారం రోజులు పాటు మహిళలను చైతన్యం చేసే విధంగా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించాలని ఇచ్చిన పిలుపు మేరకు మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మూడో సచివాలయంలో మహిళా పోలీసులు, వలంటీర్లతో గురువారం సదస్సు జరిగింది. జడ్జి షేక్ షిరీన్ ప్రసంగిస్తూ స్త్రీని పూజించే, గౌరవించే దేశంగా ఉన్నా అనునిత్యం మహిళలపై పురుషుల ఆధిపత్యం కొనసాగుతూనే ఉందన్నారు. దీనికి కారణం మహిళలు నిరక్షరాస్యతేనన్నారు.

తైక్వాండో రాష్ట్ర పోటీలకు ఎంపిక


తైక్వాండో జిల్లా జట్టుకు ఎంపికైన సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు

విజయవాడ స్పోర్ట్స్: విశాఖపట్నంలోని యలమంచిలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్–11, అండర్–14 తైక్వాండో పోటీలకు ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్టుకు విజయవాడ గుణదలలోని సెయింట్ జోసఫ్స్ ఇంగ్లీష్ మీడియం, ప్రసాదంపాడులోని సెయింట్‌ఆన్స్ సీబీఎస్‌సీ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలోని ఆంధ్రా లయోల కాలేజీలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఈ రెండు పాఠశాలల విద్యార్థులు క్రీడా నైపుణ్యం ప్రదర్శించి పతకాలు సాధించడంతో పాటు అనంతరం జరిగిన జిల్లా జట్ల ఎంపికలో సత్తా చాటారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సెయింట్‌ఆన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ అరుణమేరీ, సెయింట్ జోసఫ్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్.నిర్మల అభినందించారు. కృష్ణా జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి ఎం.అంకమరావు, తైక్వాండో కోచ్ పి.గౌరీశంకర్ అభినందించారు.